క్లుప్తంగా

విజేతలకు బహుమతుల పంపిణీ

విజయనగరం: వినాయక చవితి సందర్భంగా వాజీ చానల్ నిర్వహించిన మెగా హౌసీలో విజేతలేగా నిలిచిన వారికి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతకుమారి బహుమతులు అందజేశారు. వాజీ కార్యాలయంలో గురువారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పారదర్శకంగా వార్తలు అందించడంలో గుర్తింపు పొందిన వాజీ చానల్ మహిళా గర్జన వంటి సామాజిక, ప్రజా చైతన్య కార్యక్రమాలను కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. పండుగ ఏదైనా ప్రజలకు హౌసీ నిర్వహించడమే కాకుండా ఆకర్షణీయమైన బహుమతులు అందజేయడం, సంస్కృతీ, సంప్రదాయాలను గౌరవిస్తూ రంగోలీ పోటీలను నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలాన్ని లీజుకిస్తే సహించం

- సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పీపీపీ మోడల్‌లో లీజుకిస్తే సహించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వారికి కట్టబెట్టాలనుకోవడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికే నగరంలో అనేక జూట్ మిల్లులు, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూతపడ్డాయని, వాటిని తెరిపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ స్థలాలు ఇతరులకు ఇస్తే ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు శంకరరావు, రమణ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. వెంకట రామకృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్‌భవన్‌లో ఏపీఈపీడీసీఎల్ విజిలెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిని ముందుగా గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె. కృష్ణ, ఏఈఈపీడీసీఎల్ ఎస్ఈ ముప్పాల లక్ష్మణ రావు, ఈఈలు కె. చలపతిరావు పూడి హరి, జి. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

భోగాపురం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరగబోయే జిల్లాస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. శరత్‌కుమార్ తెలిపారు. మండలంలోని రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఇటువంటి సభలు దోహదపడతాయని చెప్పారు. జిల్లాలోని అందరు ఉపాధ్యాయులు పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రజలందరిపై దుర్గమ్మ ఆశీస్సులు

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల: దుర్గమ్మ చల్లని దీవెనలు నియోజక వర్గ ప్రజలందరిపైనా ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఆకాంక్షించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో గురువారం ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయన వెంట 2, 3 వార్డుల కౌన్సిలర్లు పైల భారతి, మొయిద శ్రీనివాసరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకుడు ధవళ లక్ష్మణరావు, స్థానిక పెద్దలు జనార్దనరావు, సారిపల్లి కృష్ణ, పైల మురళి, పాలూరి వాసు, తదితరులున్నారు.

ఇదేం ప్రజా దర్బార్..!

- స్థానిక కార్పొరేటర్ లేకుండానే నిర్వహణ



13వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ లేకుండానే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం: ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు ప్రత్యేక విలువ ఉంటుంది. ప్రజల ఓట్లతో గెలిచిన వారు అధికారికంగా కొన్ని హక్కులు కలిగి ఉంటారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులకు ఆ గౌరవం దక్కడం లేదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. నగరంలోని 13వ డివిజన్ కొత్తపేట బ్రహ్మంగారి మఠంవీధిలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ ఇందుకు సాక్షిగా నిలిచింది. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో పాటు సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. అంతే కాకుండా వేరే డివిజన్‌లకు చెందిన ప్రజాప్రతినిధులు సైతం పాల్గొన్నారు. అయితే స్థానికంగా ఉన్న కార్పొరేటర్‌కు మాత్రం ఎటువంటి సమాచారం అందించకపోవడం గమనార్హం. దీంతో ప్రజాదర్బార్‌కు వచ్చిన వారంతా స్థానిక కార్పొరేటర్ లేకుండా కార్యక్రమం నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

శైలపుత్రీ నమోస్తుతే..



విజయనగరం రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు



నెల్లిమర్ల రూరల్: ఒమ్మిలో అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు విగ్రహాలను మేళతాళాల నడుమ గ్రామాల్లో ఊరేగించారు. మొదటి రోజు అమ్మవారు శైలపుత్రీ బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమపూజలు చేపట్టారు. నెల్లిమర్ల మండలం ఒమ్మిలో 150 కిలోల పసుపుకొమ్ములతో సుమారు 18 అడుగుల అమ్మవారి ప్రతిమను తయారు చేసి ప్రతిష్ఠించారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసి, మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్/ సాక్షి ఫొటోగ్రాఫర్



పూసపాటిరేగ: గ్యాస్ గొడౌన్ సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి



విజయనగరం టౌన్: జ్ఞాన సరస్వతీ ఆలయంలో అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు



విజయనగరం టౌన్: బాల త్రిపుర సుందరీదేవీ అలంకరణలో దుర్గాదేవి



విజయనగరం టౌన్: గాజులరేగలో గారెల అలంకరణలో దుర్గాదేవి



హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో..



రైల్వే స్టేషన్ రోడ్డులో నాగకన్య అవతారంలో అమ్మవారు



నెల్లిమర్ల: కొండపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ పెనుమత్స



పాత బస్టాండ్ రోడ్డులో దేవీనవరాత్రుల్లో భాగంగా వేసిన సెట్



పాతబస్టాండ్ వద్ద విద్యుత్ ధగధగలు

సెల్ఫీల కోసం పట్టాలెక్కొద్దు..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రీధర్

విజయనగరం క్రైమ్: సెల్ఫీ సరదాల కోసం రైలు పట్టాలెక్కి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్సై శ్రీధర్ సూచించారు. గురువారం స్థానిక కొత్త అగ్రహారంలో ఉన్న ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు రైలు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైళ్లు వెళ్తున్నప్పుడు రాళ్లు విసరడం, సరదాలకు పట్టాలపై నడవడం చేస్తూ చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. అదేవిధంగా సెల్ఫీల మోజులో వారేం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. అనంతరం గాజులరేగ పరిసర ప్రాంతాల్లో ఉన్న రాళ్లమాలపల్లి, గాజులరేగ బీసీ కాలనీ ప్రాంతాల్లో కూడా అవగాహన సదస్సులు నిర్వహించారు.

వర్క్‌షాపు ప్రారంభం



వర్క్‌షాప్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థులు మార్కెటింగ్ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు నిపుణులైన ట్రైనర్స్‌తో నిర్వహిస్తున్న ప్రత్యేక వర్క్‌షాప్‌ను సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు గురువారం ప్రారంభించారు. ఈ మేరకు తోటపాలెంలో ఉన్న కళాశాల ఆవరణలో వర్క్‌షాప్ కరపత్రాలను ఆవిష్కరించారు. మార్కెటింగ్‌లో విశేష అనుభవం ఉన్న గుడిమెట్ల బెనర్జీ వినియోగదారుల ప్రవర్తన – విశ్లేషణ, బ్రాండింగ్ వంటి అనేక విషయాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ మీసాల సత్యవేణి, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సూరపునాయుడు, అధ్యాపకులు ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారామచంద్రస్వామి ఆస్థాన మండపంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అర్చకులు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా స్వామి సన్నిధిలో విష్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాలలో దీపారాధన, మృత్సంగ్రహణం, అంకురారోపణ, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు సాయిరామాచార్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా కన్యామాసంలో చిత్తా నక్షత్రాన్ని మొదలుకుని శ్రావణ నక్షత్రం వరకు బ్రహ్మోత్సవాలు జరిపించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శుక్రవారం ధ్వజారోహణం జరిపించి శ్రీవారి కల్యాణోత్సవాలకు సమస్త దేవతామూర్తులను ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, పవన్‌కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో వార్డు పర్యటన



11వ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: వార్డు పర్యటనలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు 11వ డివిజన్‌లో గురువారం పర్యటించారు. అంబటిసత్రం జంక్షన్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటన చందాల వీధి, కోట్ల మాదప్పవీధి, తదితర ప్రాంతాలలో సాగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ మధుసూదనరావు, ఏఓ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను తయారీ పనులు ప్రారంభం



సిరిమాను ముస్తాబు చేసే ప్రక్రియను పర్యవేక్షిస్తున్న పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవంలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవానికి సంబంధించి హుకుంపేటలో పూజలందుకుంటున్న సిరిమాను చెట్టుకు ముస్తాబు చేసే పనులను గురువారం ప్రారంభించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు నేతృత్వంలో 12 మంది వడ్రంగులు కీలక పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. వారం రోజుల్లో పనులన్నీ పూర్తవుతాయన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం..

- రైతు, ఐద్వా సంఘాల నాయకులు



నిరాహార దీక్షలో పాల్గొన్న రైతు, కౌలు రైతు, ఐద్వా నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని రైతు, కౌలురైతు, ఐద్వా సంఘాల జిల్లా కార్యదర్శులు బి. రాంబాబు, రాకోటి రాములు, పాలూరి రమణమ్మ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు ఆయువు పట్టుగా ఉన్న ఏకైక పెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఎంతోమంది ప్రాణ త్యాగాల వల్ల ఏర్పాటైన విశాఖ ఉక్కును అమ్మేయాలను చూస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. నిరసన దీక్షలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు గోపాలం, కౌలురైతుల సంఘ నాయకుడు పైడిపినాయుడు, ఐద్వా నాయకురాలు వి.లక్ష్మి పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఆస్తి, నీటి పన్నుతో పాటు ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులు వసూలు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు అన్నారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు పరిపాలనా కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్నులు విధించని భవనాలకు పన్నులు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ రమణ, ఆర్ఐ పాపయ్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



మహిళా మార్ట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం: స్వయం సహాయక సంఘ మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్ట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను తిలకించారు. తయారు చేసే విధానం, అమ్మకాలు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసారిగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఆనాటి నుంచి మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు. ప్రజలు అర్బన్ మార్టులలో సరుకులు కొనుగోలు చేసి స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థిక బలోపేతానికి సహకరించాలని కోరారు. కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ.. మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్ట్ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని వన్‌టౌన్‌పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని, 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ ఎస్.శ్రీనివాస్ నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక రైల్వేస్టేషన్ హెల్ప్‌డెస్క్ సమీపంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన కబీరుద్దీన్ మంజూర్ అలీ అనే వ్యక్తి గంజాయి కలిగి ఉన్నట్లు నిఘా వర్గాల ద్వారా అందుకున్న సమాచారంతో వన్‌టౌన్ ఎస్సై నరేష్, తన సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకుని అనుమానాస్పదంగా తిరుగుతున్న కబీరుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోరాపుట్ నుంచి గంజాయి పట్టుకుని బుధవారం రాత్రి బయలుదేరి గురువారం ఉదయం విజయనగరం రైల్వేస్టేషన్‌లో దిగి వేరే ట్రైన్‌లో ముషీరాబాద్ వెళ్లిపోవాలని కబీరుద్దీన్ అనుకున్నాడు. ఇంతలో టిఫిన్ చేద్దామని బయటకు రాగా పోలీసులు అదుపులోకి తీసుకుని 21 కిలోల గంజాయి, రెండు మొబైల్స్, రూ.500 నగదు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పెద్దింటి త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపాలెం సబ్ స్టేషన్‌లో గల 11 కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ మీద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో ఇందిరానగర్, బ్యాంక్ కాలనీ, శ్రీరామ్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయ గణపతికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: మండల కేంద్రంలోని శ్రీరామనారాయణం క్షేత్రంలో కొలువైన విజయగణపతికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రం సందర్భంగా అర్చకులు స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు స్నపన పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం సురేష్‌కుమార్

నెల్లిమర్ల: వెలుగు ఏపీఎంగా ఎస్. సురేష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్.కోట మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎల్. సత్యనారాయణ గజపతినగరానికి బదిలీపై వెళ్లారు. విధుల్లో చేరిన సురేష్‌కుమార్‌కు కార్యాలయ సిబ్బంది, గ్రామైక్య సంఘాల సహాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



నాగలక్ష్మి, ఎక్సైజ్ ఎస్సై

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎక్సైజ్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. నాగలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నాగలక్ష్మి గతంలో నెల్లిమర్లలో విధులు నిర్వహించి, ఎలక్షన్ సమయంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం స్టేషన్‌కి బదిలీపై వెళ్లారు. ఇప్పుడు అక్కడ నుంచి నెల్లిమర్లకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన కె. కల్యాణికి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం స్టేషన్‌కు బదిలీ జరిగింది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- కమిషనర్ నల్లనయ్య



సమస్యల పరిష్కారంపై సిబ్బందిని ఆదేశిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. నగర పరిధిలోని వివిధ ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. తోటపాలెం, వీటీ అగ్రహారం, ఉడా కాలనీ ఫేజ్ 1,2 కాళీఘాట్ కాలనీ, తదితర ప్రాంతాల్లో పర్యటించి పలు సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. వీటీ అగ్రహారం పార్కు వద్ద అనధికారికంగా వాహనాలు నిలుపుదల చేయడాన్ని గమనించి వెంటనే వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే పార్కు చుట్టూ మొక్కలు, పొదలు తొలగించాలని సూచించారు. ఉడా కాలనీలో కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించాలన్నారు.